క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



పెదకాకాని: మండలంలోని అగతవరప్పాడు గ్రామానికి చెందిన ఏడుగురు వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆట్ల సుబ్బారెడ్డి, ఎస్.వెంకటేశ్వరి, ఎన్.అఖిల్‌కుమార్, ఎన్.స్వర్ణలత, డి.దివ్య, కె.కల్యాణి, పి.లక్ష్మీపావని రాజీనామా పత్రాలు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందజేస్తున్న వలంటీర్ల విధులను ప్రతిపక్ష పార్టీల నేతలు అడ్డుకోవడం బాధాకరమన్నారు.

29 నుంచి వేసవి శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: ఏటుకూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయం అధికారిణి పి.పరమేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు కథలు చెప్పటం, కథలు చెప్పించటం, చిత్రలేఖనం, ఆటలు తదితరాలపై శిక్షణనివ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంపొందించి, సృజనాత్మకతకు మెరుగులు దిద్దటం ఈ శిక్షణ ఉద్దేశమని, ఆసక్తిగల తల్లిదండ్రులు తమ పిల్లలను పంపాలని పేర్కొన్నారు.

'కళ్ళం' అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులతోపాటు అధ్యాపకులకు ఉజ్వల భవిష్యత్తు, లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుందని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో అధ్యాపకురాలి అభినందన కార్యక్రమం నిర్వహించారు. తమ కళాశాల అధ్యాపకురాలు బి.బిందుమాధవికి జేఎన్‌టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని తెలిపారు. డిగ్రీ ఇన్ ది కాంటెంపరరీ ఇండియన్ ఇంగ్లీష్ లిటరేచర్ అనే అంశంపై విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ పి.అపర్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ పీఎల్ మాధవరావు అభినందించారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



గుంటూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని స్వర్ణభారతి నగర్‌లో సీఐ నరేష్ కుమార్ శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు వినియోగం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. నల్లపాడు పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



పెదకాకాని: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలసులు శనివారం తెలిపారు. పెదకాకాని పోలీసు స్టేషన్ పరిధిలోని మెహర్ బాబా టెంపుల్, ఒమేగా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన వువ్వాడ ఈశ్వరమ్మ ఈ నెల 24న అలిగి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. మరలా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులకు సమాచారం అందించినప్పటికీ ఎటువంటి ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త రాంబాబు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మహిళ అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: పెయింటింగ్ కార్మికుడు భవనంపై నుంచి కింద పడి మృతిచెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నంబూరుకు చెందిన కృష్ణ(51) అరండల్‌పేట 6వలైనులో ఓ భవనంపై పెయింట్ వేస్తూ ఐదో అంతస్తు నుంచి కిందపడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం

- వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం.. సంక్షేమ పథకాలు కొనసాగిద్దాం
- ప్రతి అడుగు ప్రజా సేవకోసమే : అంబటి మురళీకృష్ణ
- కొప్పురావూరులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం
- జనసేన నుంచి 150 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



కొప్పురావూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో తాము వేసే ప్రతి అడుగూ ప్రజాసేవ కోసమేనని పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీ కృష్ణ అన్నారు. మండలంలోని కొప్పురావూరు గ్రామంలో శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వృద్ధులను, దివ్యాంగులను పలకరిస్తూ ముందుకు సాగారు. గ్రామంలో జరిగిన బహిరంగ సభకు మాదా రాధ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంచి జరగాలన్నా మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలన్నారు. రాజకీయాల్లోకి రాకముందే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని భజరంగ్ ఫౌండేషన్‌ను స్థాపించి, ఉచితంగా వైద్య సేవలు అందించానని అంబటి తెలిపారు. జగన్నామ సంక్షేమ సంగమం పేరుతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశానన్నారు. గుండె, కంటి పరీక్షలు, యాంజియోగ్రామ్ సర్జరీలు చేయించానని, నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో పర్యటించి 27 వేల మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశానని అంబటి మురళీకృష్ణ వివరించారు. కొప్పురావూరు గ్రామంలోనే 720 మందికి కళ్లజోళ్లు ఇచ్చానని చెప్పారు. ప్రజా సేవ చేసేందుకు వచ్చి ఓటు అభ్యర్థిస్తున్నానన్నారు. ప్రాణం ఉన్నంత వరకూ నియోజకవర్గం నుంచి రాగి పైసా కూడా ఆశించకుండా నిజాయితీగా పరిపాలన కొనసాగించడంతో పాటు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్వించేలా పని చేస్తానని అంబటి హామీ ఇచ్చారు. ఎన్నికలు వచ్చినపుడే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడికి ప్రజలు గుర్తుకొస్తారని, ఆయన మాయ మాటలు, బూటకపు హామీలను నమ్మి ఎవరూ మోసపోవద్దన్నారు.



జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన యువకులతో అంబటి మురళీకృష్ణ

ఇళ్ల నిర్మాణాలను అడ్డుకున్న టీడీపీ..

ప్రభుత్వం 50వేల మంది నిరుపేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తే.. ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించకుండా టీడీపీ నాయకులు అడ్డుకోవడం బాధాకరమని అంబటి మురళీకృష్ణ అన్నారు. పెత్తందార్లు భవనాల్లో, నిరుపేదలు రోడ్లు, కాల్వల గట్లపై ఉంటున్నా టీడీపీ నాయకులకు జాలిలేదని ఆరోపించారు. గుంటూరు నగర డెప్యూటీ మేయర్ వనమా డైమండ్‌బాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొన్నూరు నియోజకవర్గంలో అత్యధిక జనాభా ఉన్న సామాజిక వర్గానికి ఎమ్మెల్యే సీటు కేటాయించడం జరిగిందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ నియోజకవర్గంలో 25 ఏళ్లకు పైగా ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి పెత్తనం చేస్తున్నాడని, ప్రజలు ఆలోచించి ఓటు ద్వారా సేవ చేసే అంబటి మురళీకృష్ణను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నుంచి 150 మంది యువకులు అంబటి మురళీకృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి, వారందరిని ఆయన సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, కామినేని శివశంకర్, మోహన్‌రావు, పరగండ్ల నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, ఆలా శ్రీనివాసరావు(సఫారి), చిల్లా వెంకటేశ్వరరావు, కురగంటి సుధాకర్, యర్రంశెట్టి తులసీరామయ్య, ఆకుల వెంకటేశ్వరరావు, ఎస్కే సుబాని, భీమవరపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శనివారం అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు కొనసాగాయి. శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలను నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పలు రాష్ట్రాల నృత్య కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ప్రముఖ ఆంధ్ర నాట్య కళాకారుడు సంజయ్ వాడపల్లిని అక్కిరాజు మనీప్రియ స్మారక సాత్రాజితి పురస్కారంతో, భరత నాట్య కళాకారుడు మొున్ జిత్‌షా(కలకత్తా), కూచిపూడి నృత్య కళాకారిణి మధువతి కులకర్ణి (బెంగళూరు)లను యువ కళారత్న పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రముఖ కవి, చిత్రకారుడు అక్కిరాజు శ్రీహరిబాబు, సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, ఎర్రగుంట ప్రశాంతి పాల్గొన్నారు.



వేదికపై జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న అతిథులు

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఆయుధం



2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్ శేషన్న



రన్‌లో పాల్గొన్న ఉద్యోగులు, ఓటర్లు

- మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న
- తెనాలిలో విజయవంతంగా ముగిసిన 2కే రన్

తెనాలిఅర్బన్: ఓటు అనే వజ్రాయుధాన్ని సక్రమంగా ఉపయోగించడం ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవచ్చని తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణంలోని రజక ఐలమ్మ పార్కు వద్ద శనివారం ఉదయం ఏర్పాటు చేసిన 2కె రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. ఓటును అమ్ముకోకుండా సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రతి రోజు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనూష మాట్లాడుతూ కొత్తగా ఓటు పొందిన యువతీ, యువకులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటింగ్ శాతాన్ని పెంచే దిశగా ప్రజలకు అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ తమ పవిత్రమైన ఓటును ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని కోరారు. రజక ఐలమ్మ పార్కు నుంచి ప్రారంభమైన 2కె రన్ గాంధీచౌక్, బోసురోడ్డుల మీదుగా చినరావూరులోని పార్కు వరకు కొనసాగింది. అనంతరం అక్కడ ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను అందరూ చేశారు. కార్యక్రమంలో పలువురు సీఐలు, పట్టణ ప్రముఖులు, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, కాలేజ్ విద్యార్థినీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

గుడిబండివారిపాలెం(కొల్లిపర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ సంచాలకులు, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం(సమ్మర్ క్యాంప్)లు నిర్వహిస్తున్నట్లు కొల్లిపర శాఖా గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు తెలిపారు. శనివారం గుదిబండివారిపాలెం శాఖా గ్రంథాలయంలో ఆయన సమ్మర్ క్యాంప్ వివరాలు వెల్లడించారు.1 నుంచి 7వ తరగతి వరకు చదివే విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, స్టోరీ టెల్లింగ్, పేపరు క్రాఫ్ట్ ఆర్ట్, మ్యూజికల్ డ్యాన్స్, క్యారమ్స్, చెస్, డ్రాయింగ్ మొదలగు వాటిని నేర్పించటం, చదివించటం జరుగుతుందన్నారు. క్యాంప్ ఆఖరి రోజున వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించటం జరుగుతుందన్నారు. వేసవిలో ఇంటి దగ్గర ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్

తెనాలిఅర్బన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పాలిసెట్–2024 పరీక్ష తెనాలిలో ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కాలేజీ, మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో పరీక్షలు జరిగాయని అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. సుమారు 750 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు చెప్పారు.



నేడు ఆక్స్‌ఫర్డ్ ప్రతిభ పురస్కార మహోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ– జేఈఈ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కార మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 570కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఉదయం 10 గంటలకు చంద్రమౌళీనగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట ఉన్న ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ–జేఈఈ, నీట్ అకాడమీలో హాజరై ప్రతిభా పురస్కారాన్ని అందుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట టెన్త్ మార్కుల జాబితా తీసుకుని రావాలని తెలిపారు. వివరాలకు 9177447924, 9959703265లో సంప్రదించాలని సూచించారు.

బదిలీపై వెళ్తున్న ముగ్గురు జడ్జిలకు సత్కారం

నగరంపాలెం: మూడేళ్లు సమర్థంగా విధులు నిర్వర్తించి, న్యాయమైన తీర్పులను వెలువరించారని జిల్లా జడ్జి పార్థసారథి అన్నారు. ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పొన్నూరు బుజ్జి విజయనగరం జిల్లాకు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతి ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్‌ను విజయవాడకు బదిలీయ్యారు. ఈ మేరకు ఆ ముగ్గురు జడ్జిలను శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. సత్కార సభకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీవీ గౌరీశంకర్ అధ్యక్షత వహించగా, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, రాజేష్, లక్ష్మి, పాలడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసాయి కళాశాల వార్షికోత్సవం

నగరంపాలెం: ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని శ్రీసాయి రాగ సంగీత కళాశాల తృతీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి అధ్యక్షత వహించారు. శిష్యులు అన్నమయ్య కీర్తనలు, భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, లీలైట్స్ అధినేత ఉన్నం శ్రీనివాసరావులను సత్కరించారు. జి.నాగసాయి, పి.వి.రమణ, టి.ఈశ్వర్ వాయిద్య సహకారం అందించారు. పమిడి కుమార్ శేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

విద్యతో పాటు విలువలు అలవర్చాలి

విశ్రాంత జిల్లా న్యాయమూర్తి వెంకట రమణ రాయలు



వెంకట రమణ రాయలును సత్కరిస్తున్న మాజేటి ప్రసాద్, హేమాంబ, ఉషశ్రీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే విద్యతో పాటు విలువలు అలవర్చాలని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పి.వెంకట రమణ రాయలు పేర్కొన్నారు. కలెక్టర్ బంగా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు సంప్రదాయ నృత్య, నాటక ప్రదర్శనలు, ఏకపాత్రాభినయం, సంగీత వాయిద్యాలతో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రధాన కార్యదర్శి గోపాలరావు, కోశాధికారి మాజేటి ప్రసాద్, ప్రిన్సిపల్ హేమాంబ, హెచ్‌ఎం ఉషశ్రీ పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై మరింత కృషి జరగాలి

కృష్ణ మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని లాం ఫాం నందు శనివారం కృష్ణ మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గతేడాది పరిశోధన స్థానాలు, కేవీకేలు, ఏరువాక కేంద్రాల్లో నిర్వహించిన పరిశోధనలు, ప్రగతి, విస్తరణ కార్యక్రమాలను ఏడీఆర్ వివరించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులను పంటలు తట్టుకునే విధంగా రైతులకు విస్తృతంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలన్నారు. విత్తనోత్పత్తిపై మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ ఆధారిత సలహాలు, సూచనలకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. డీడీఏ బాలు నాయక్ మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. 20 జిల్లాల్లో నాలుగు పంట ఉత్పత్తులను డిజిటల్ ప్లాట్‌ఫాంలో విక్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులు జిల్లాల వారీగా పంటల విస్తీర్ణం, క్షేత్రస్థాయి సమస్యలు, వివిధ పంటల్లో మినిట్లు ఫలితాలను తెలిపారు. పంటల ప్రధాన శాస్త్రవేత్తలు వివిధ పంటల్లో నూతన శాస్త్ర పరిజ్ఞానాన్ని తెలియజేస్తూ రైతుల సమస్యలకు పరిష్కారాలు చూపారు. రానున్న ఏడాదిలో చేపట్టాల్సిన పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాల కార్యాచరణపై చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రకాశం, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, గుటూరు జిల్లాల వ్యవసాయ అధికారులు, డీఆర్‌సీ అధికారులు, అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియంతో ఆరోగ్యకర పంట ఉత్పత్తులు

- నేలలో సేంద్రియ పదార్థం తప్పనిసరిగా పెంచాలి
- సాయిల్ సైంటిస్ట్ డాక్టర్ కె.వీరయ్య



గానుగ నూనె తయారీని వివరిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.వీరయ్య

గుంటూరు రూరల్: నేలలో తగిన మోతాదులో సేంద్రియ పదార్థం ఉన్నట్లయితే జీవజాలం ఉండడానికి అవకాశం ఉంటుందని, ఆరోగ్యకరమైన పంటలను పొందవచ్చని సాయిల్ సైంటిస్ట్ డాక్టర్ కె.వీరయ్య తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం వుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో ఉపయోగించే రసాయనాల వల్ల నేలలో ఉండే సూక్ష్మజీవులు నశించిపోతున్నాయన్నారు. ఈ సమస్యకు పరిష్కారం రైతులు సేంద్రియ బాట పట్టడమేనని సూచించారు. కషాయాల తయారీ విధానాన్ని సేంద్రియ రైతు శివనాగమల్లేశ్వరరావు రైతులకు వివరించారు. గోశాల, కట్టెగానుగతో నూనె తీసే ప్రక్రియ, వానపాముల ఎరువు, ఘన జీవామృతం తయారీ విధానం ప్రత్యక్షంగా చూపించారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వేంకటేశ్వరరావు ఉన్నారు.

వైభవంగా విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: అల్లంవారిపాలెం గ్రామంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయ 8వ ప్రతిష్ఠ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆంజనేయశర్మ, పూర్ణచంద్రశాస్త్రి, పురుషోత్తమశాస్త్రి స్వామివారికి పంచామృతాలు, చందనంతో అభిషేకాలు నిర్వహించారు. గరికతో అష్టోత్తర, సహస్తనామ పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామిని నూతన వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ ముఖ మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాధారణ చేసి గణపతి, రుద్ర, లక్ష్మీ హోమాలను వేదపండితులు అనిల్‌శాస్త్రి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక ఐసీయూ వార్డు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో వడ దెబ్బ బాధితుల కోసం ప్రత్యేక జనరల్ మెడిసిన్ ఐసీయూ వార్డును కేటాయించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరు పడకల వార్డును శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వడగాడ్పులు తీవ్రతకు గురైన బాధితుల కోసం ప్రత్యేక వార్డును కేటాయించినట్లు చెప్పారు. వడ దెబ్బకు గురైన బాధితులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వడ దెబ్బకు గురైన వారికి ఎక్కువగా తలనొప్పి, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. శరీరం కూడా ఎర్రగా మారుతుందని వివరించారు. శ్వాస పీల్చుకోవడం కష్టంగా ఉంటుందని అలాంటి వారు చల్లని ప్రదేశంలోకి వెళ్లాలని ఆయన సూచించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వడ దెబ్బకు గురవుతారని చెప్పారు. అలాంటి వారికి ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య సదుపాయాలను అందిస్తామని తెలిపారు. అత్యవసర చికిత్స విభాగానికి రాగానే వారికీ ప్రథమ చికిత్స అందించి అనంతరం వార్డుకు తరలిస్తారని పేర్కొన్నారు. బాధితులు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ముఖ్యంగా వడ దెబ్బకు గురైన వారు చల్లని నీరు తాగాలని, సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం సమయంలో రోడ్డుపై తిరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో వడ దెబ్బకు గురైన వారికి ప్రత్యేక వైద్యం అందిస్తారని తెలిపారు. డీఎంఈ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక వార్డును కేటాయించినట్లు తెలిపారు.

ఆదినారాయణకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న ఆదినారాయణ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు ఆరాధ్యుల ఆదినారాయణకు జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని ఊటీలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో ఈ గౌరవాన్ని ఆయనకు అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.గోపికన్నన్ అధ్యక్షతన జరిగిన వేడుకలో ముఖ్య అతిథిగా గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్, జర్మనీ సభ్యుడు డాక్టర్ జార్జి ఫ్రాయిండ్ పీటర్ పాల్గొన్నారు. మీడియా డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రాబిన్ రామ్మయు హెని, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. 'గానకోకిల' ఏవీ సుబ్బారావు తనయుల్లో ఒకరైన ఆదినారాయణ తండ్రి, సోదరుల బాటలోనే రంగస్థలానికి అంకితమయ్యారు. 1987లో హార్మోనిస్టుగా కెరీర్‌ను ప్రారంభించారు. 1994లో నటుడిగా ఆరంగేట్రం చేశారు. 1997లో శ్రీ దుర్గాభవాని నాట్యమండలితో సొంత సమాజంతో ప్రదర్శనలిస్తూ పౌరాణిక పద్య నాటకానికి ప్రాణం పోస్తున్నారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, భవానీ శంకరుడు పాత్రల్లో నటిస్తున్నారు. పలు అవార్డులను స్వీకరించారు.

2 నుంచి బైబిల్ స్కూల్ తరగతులు

తెనాలిఅర్బన్: టీవోజీ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మే 2, 3, 4 తేదీల్లో వెకేషన్ బైబిల్ స్కూల్ ఉచిత తరగతులను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అత్తోట హేమలత, అత్తోట ప్రభాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని చెప్పారు. బైబిల్‌కు సంబంధించిన పాటలు, స్కిట్‌లు, గేమ్స్, తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దయమణి జోసఫ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో తరగతులు జరగనున్నట్లు వివరించారు.